# నిరుపేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడలో 144 మందికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

**శెనార్తి మీడియా, వేములవాడ:**



నిరుపేదల సొంతింటి కల నెరవేరుస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని స్వంత ఇల్లు లేక అడుగు జాగా లేని 144 మంది అర్హులకు ఇందిరమ్మ పథకం కింద గృహ పటాలను శనివారం పంపిణీ చేశారు. స్థానిక ఎస్ఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లబ్ది దారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్ డిపో పక్కన నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల స్థలంలో 12 బ్లాకులుగా, జి+2 మోడల్‌లో నిర్మించిన 144 ఇండ్లను పేదలకు కేటాయించామని తెలిపారు. ఈ నిర్మాణానికి మొత్తం రూ.7.63 కోట్లు మంజూరైందని, ఇప్పటివరకు రూ.2 కోట్లు ఖర్చు కాగా, మిగిలిన రూ.5.63 కోట్లతో నిర్మాణాలు పూర్తి చేసి అందజేస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయంలో నిర్మించి కాలిపోయిన ఇండ్లను తిరిగి వాడుకలోకి తీసుకు వచ్చామన్నారు. ఆనాడు ఈ ఇండ్లను పేదలకు ఇవ్వాలంటూ ధర్నాలు, డిమాండ్లు చేసినట్టు గుర్తు చేశారు. "ఇప్పుడు అదే ఇండ్లను ఇప్పిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లతో పేదల కళ్లల్లో ఆనంద బాష్పాలు కనిపిస్తున్నాయి" అని వ్యాఖ్యానించారు. ఇండ్లు పొందిన కుటుంబాలు సీఎం రేవంత్ రెడ్డి చిత్రాలతో తమ ఆనందాన్ని తెలియజేశాయని తెలిపారు. రాజన్న ఆలయానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కేటాయింపులు లేకపోయినప్పటికీ, ఇప్పుడు రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. అదనంగా రూ.76 కోట్లతో ఆలయ అభివృద్ధి, రూ.35 కోట్లతో అన్నదాన సత్రం, రూ.3 కోట్లతో భీమన్న ఆలయ అభివృద్ధి కొనసాగుతోందన్నారు. పట్టణంలోని మూలవాగు పై మూడో బ్రిడ్జి, మురుగు నీటి వ్యర్థాల నియంత్రణ, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలపై భారీగా ఖర్చు చేస్తున్నామని వివరించారు. వేములవాడ పట్టణంలో ఇంకా 2 వేల మందికి ఇళ్లు అవసరమని గుర్తించామన్నా రు. ఈ అంశాన్ని సీఎం, గృహ నిర్మాణ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి అందరికీ ఇళ్లు రావాలని కృషి చేస్తానన్నారు. "మీ ఆశీర్వాదాలతో గెలిచిన నేను, మీ బిడ్డగా, మీతో కలిసి పని చేస్తాను. ఎవరికైనా ఏ సమస్య ఉన్నా చెప్పండి, పరిష్కారానికి సాయిపడతా," అని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, గృహ నిర్మాణ శాఖ అధికారులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మాజి కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## వేములవాడలో డిజిటల్ విద్యకు శ్రీకారం

### నీట్, ఐఐటీ, జేఈఈ కోర్సులకు ఉచిత శిక్షణ ప్రారంభం

**శెనార్తి మీడియా, వేములవాడ:**

వేములవాడ పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాల, కళాశాల లో శనివారం డిజిటల్ విద్యా కార్యక్ర మాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షిస్తూ బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు రూపొందించారని, మహిళా శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో అన్ని పాఠశాలలకు విస్తరించనున్నదని చెప్పారు. ఈ శిక్షణలో ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల విద్యావేత్తలు, శిక్షకులు బోధన చేస్తారని వివరించారు. ఉపాధ్యా యులు అంకితభావంతో శ్రమించి విద్యా ర్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. మహిళా సాధికారిక త కేంద్రం కోఆర్డినేటర్ రోజా, మార్కెట్ కమిటీ చైర్మన్ రొడ్డి రాజు, ప్రిన్సిపాల్ శ్యామల, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఇంటింటికీ రాఖీ.. పసుపు–కుంకుమ పంపిణీ

### కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి ఆధ్వర్యంలో గన్నేరువరం మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికీ రాఖీలు పంపిణీ చేసే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అన్నా–చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ ప్రాముఖ్యతను పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించడాన్ని అభినందనీయమని పేర్కొన్నారు. రాఖీలతో పాటు మహాశక్తి దేవాలయంలో అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పసుపు, కుంకుమను కూడా పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకుడు ముత్యాల జగన్ రెడ్డి తెలిపారు. సమాజం లో అనుబంధాలను గుర్తుచేస్తూ, మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను అరిక ట్టేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉప యోగపడతాయని కేంద్ర మంత్రి పేర్కొన్నా రు. గత మూడు ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నట్లు జగన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పుప్పాల రఘు, సొల్లు అజయ్ వర్మ, వరాల జ్యోతి, బండా రు గాయత్రి, మాసం గణేష్, తాడూరి కిరణ్ రెడ్డి, బామండ్ల రాజు, మునిగంటి సత్తయ్య, పుల్లెల రాము తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

**శెనార్తి మీడియా, గన్నేరువరం:** గన్నేరువరం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఆరోగ్య హాస్పిటల్ సహకారంతో కొమ్మెర రవీందర్ రెడ్డి ఫౌండేషన్ ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం : కాంగ్రెస్

**శెనార్తి మీడియా, నల్లగొండ:**



బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని ఆపదని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వమే అడ్డుగా మారిందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దుబ్బ అశోక్ సుందర్ తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో దేశానికి రోల్ మోడల్ కావాలన్నదే రాహుల్ గాంధీ లక్ష్యమని, ప్రజల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడుతూ ఈ మాటలు తెలిపారు.

## చాణక్య పొదుపు సంఘం గణకుడి ఉద్యోగ విరమణ



**శెనార్తి మీడియా, తిమ్మాపూర్:**

చాణక్య పురుషుల పొదుపు సహకార సంఘంలో 28 సంవత్సరాలుగా గణకుడిగా సేవలందించిన కోమటిరెడ్డి ఆది రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా సంఘం తరపున ఘనంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు మదన వీరయ్య, చాణక్య సంఘ అధ్యక్షుడు ఎల్లలా సదానందం, పాలకవర్గ సభ్యులు గణకుడు అశోద రాజేష్ తదితరులు పాల్గొన్నారు. విరమణ సందర్భంగా ఆది రెడ్డి సేవలను ప్రశంసిస్తూ, ఆయన కృషి గురించి గుర్తు చేశారు.




## మల్లారంలో ఉచిత వైద్య శిబిరం

**శెనార్తి మీడియా, వేములవాడ :**

వేములవాడ రూరల్ మండలంలోని మరం గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ దివ్యశ్రీ ఆదేశాల మేరకు ఈ శిబిరం ఏర్పాటు చేశారు.శిబిరంలో మొత్తం 79 మందిని వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తాజుద్దీన్, ఆరోగ్య పర్యవేక్షకులు గంగమరాజు, ఏఎన్ఎంలు పద్మ, కవిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ అమ్మవారి ఆలయం కూల్చివేతను ఖండించిన హిందూ సంఘాలు

**శెనార్తి మీడియా, నల్లగొండ:**



జూబ్లీహిల్స్‌లో ఉన్న పురాతన అమ్మవారి ఆలయాన్ని కూల్చడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ కార్యకర్తలు ఆరోపించారు. ఎనభై ఏళ్లుగా పూజలు కొనసాగుతున్న ఆలయాన్ని కూల్చిన తీరును తీవ్రంగా ఖండిస్తూ, ఆలయాన్ని తిరిగి పునర్నిర్మించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ మేరకు నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. హిందూ సంఘాల కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని కూడా వారు నిరసించారు. కార్యక్రమంలో సంపత్ వర్మ, హిందూ సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## జవాన్, కిసాన్‌కే బీజేపీ ప్రాధాన్యం

### బీజేపీ గన్నేరువరం మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**



దేశానికి రక్షణగా నిలిచే జవాన్‌కు, అన్నం పెట్టే కిసాన్‌కు బీజేపీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ పేర్కొన్నారు. శనివారం పీఎం కిసాన్ యోజన 20వ విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయగా, ఈ సందర్భంగా వారణాసి నుంచి ప్రధాని మోడీ రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ప్రసంగాన్ని గుర్తు చేస్తూ తిప్పర్తి నికేష్ మాట్లాడుతూ, దేశంలో వ్యవసాయ అభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీఎం కిసాన్ నిధుల విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## యూరియా కోసం రైతుల ఆందోళన

**శెనార్తి మీడియా, గన్నేరువరం :**



యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని గ్రోమోర్ షాప్ వద్ద శనివారం రైతులు ఆందోళనకు దిగారు. యూరియా పంపిణీ చేయాలని గ్రోమోర్ షాప్ నిర్వాహకులు, ఏవో కిరణ్మయితో వాగ్వాదానికి దిగారు. యూరియా కోసమని షాప్కు వస్తే లిక్విడ్ పదార్థాలు కొంటేనే యూరియా ఇస్తామని నిర్వాహకులు కొర్రీలు పెడుతున్నారని, స్టాక్ఉన్నా లేదని చెబుతున్నారని ఆరోపించారు. బ్లాక్లో అధిక ధరలకు యూరియాను అమ్ముతు న్నారని, మూడు రోజులుగా తిరుగుతు న్నా ఒక్క బస్తా ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బం ది పెడుతున్న గ్రోమోర్ షాపును మూసివేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు, ఏవో కిరణ్మయి రైతులతో మాట్లాడారు. రైతులకు సమస్య రానివ్వకుండా చర్యలు తీసుకుంటామని సముదాయించారు.





## బడి నుంచి చిన్నారుల పొలంబాట

బడిలో శ్రద్ధగా చదువుకునే చిన్నారులు పొలం బాట పట్టారు. పంటల సాగు విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అంతేకాదు పొలంలో దిగి ఉత్సాహంగా వరి నాట్లు వేశారు. హుజురాబాద్ లోని సహస్ర పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు వన్డే ఫార్మింగ్ పేరిట పొలాల సందర్శనకు తీసుకెళ్లారు. సైదాపూర్ మండలం చింతలపల్లిలోని ఓ రైతు పొలంలో వరి నాటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఇక్కడ పాఠశాల కరస్పాండెంట్ వే ణుమాధవ్ , ప్రిన్సిపాల్ సంగీత, వైస్ ప్రిన్సిపాల్ వీరభద్రాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**శెనార్తి మీడియా, హుజూరాబాద్/ శంకరపట్నం**

## వృద్ధుడి దారుణ హత్య

**శెనార్తి మీడియా, జగిత్యాల:** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామంలో ఓ వృద్ధుడిని దారుణ హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేంపల్లి గ్రామానికి చెందిన సకిన పల్లి కాసిం (60)కు ఇద్దరు కుమారులు కలరు. తన పెద్ద కుమారుడు ఇంటి వద్దకు వెళ్లి భోజనం చేసి తన చిన్న కుమారుడి ఇంటికి నిద్రించేందుకు వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని దుండగులు హత్య చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం సంకల్పం

- ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లతో విద్యా విప్లవం..
- విద్య, వైద్య రంగాల బలోపేతం
- కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కట్టుబడి ఉందని కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. శనివారం రామకృష్ణాపూర్ కాకతీయ కాలనీలో ఆధునీకరించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించిన మంత్రి, విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం వన మహోత్సవంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లు ఏర్పాటు చేస్తున్నామని, చెన్నూర్ నియోజకవర్గంలోని సోమనపల్లిలో నిర్మాణం ప్రారంభించామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులకు ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షల వరకు పెంచడం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాయితీ గ్యాస్ సిలిండర్ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు రైతు భరోసా పథకం ద్వారా 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు జమ చేశామని తెలిపారు.జిల్లాలో వెనుకబడిన వర్గాల వసతి గృహాలు, పాఠశాలల్లో భోజనశాలల ఏర్పాటుపై ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు.కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 70 శాతం హాజరుతో పాటు ఈ విద్యా సంవత్సరంలో 7 వేల మంది కొత్తగా చేరారని తెలిపారు. పాఠశాలల్లో అన్ని సదుపాయాలను కల్పించి పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపడుతున్నామని వివరించారు. రామకృష్ణాపూర్ మండలంలో వచ్చిన 3,967 రేషన్ కార్డు దరఖాస్తుల్లో 3,220 దరఖాస్తులను అర్హులుగా గుర్తించి మంజూరు చేసినట్లు వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్ కార్డు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, డీఈఓ యాదయ్య, తహసీల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజు, శాఖల అధికారులు పాల్గొన్నారు.





## బాక్సింగ్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

- అభినందించిన కలెక్టర్ కుమార్ దీపక్



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో జిల్లా క్రీడాకారులు చూపిన ప్రతిభ అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జూలై 25 నుంచి 27వ తేదీ వరకు హైదరాబాద్ షేక్‌పేట్‌లో జరిగిన పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారని శనివారం నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఖేలో ఇండియా బాక్సింగ్ క్రీడాకారులు బి. అనురాగ్ బంగారు పతకాన్ని, ఎం. అశ్వద్ వెండి పతకాన్ని, బి. రుత్విక్ కుమార్, జి. శ్రీనాథ్‌లు కాంస్య పతకాలను సాధించారని కలెక్టర్ వివరించారు. నోయిడాలో ఆగస్టు 6 నుండి 15 వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు బి. అనురాగ్ ఎంపికవ్వడం, ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ సిహెచ్. రాజేష్ రాష్ట్ర జట్టు కోచ్‌గా ఎంపిక కావడం గర్వకారణమన్నారు.జాతీయ స్థాయిలో కూడా వారు ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి హనుమంత రెడ్డి, కోచ్ రాజేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## రక్షణ చర్యల వైఫల్యమే కారణం

- యజమాన్యం తీరుపై కార్మిక సంఘాల ఆగ్రహం



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తిపై మాత్రమే శ్రద్ధ పెట్టి, కార్మికుల రక్షణ చర్యల విషయంలో నిర్లక్ష్యం చేయడం మూలంగా కెకె–5 గనిలో ఘటించిన ప్రమాదంలో కార్మికుడు రాసపల్లి శ్రావణ్ కుమార్ మృతి చెందాడని కార్మిక సంఘాల నేతలు తుమ్మల రాజారెడ్డి (సీఐటీయు), వాసిరెడ్డి సీతారామయ్య (ఏఐటీయూసీ)లు మండిపడ్డారు. శనివారం వారు గనిపై ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గనుల్లో రక్షణ చర్యలు మెరుగుపరచాల్సిన అవసరం ఉన్నప్పటికీ యాజమాన్యం బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారిస్తోందని విమర్శించారు. పాత ఎస్డీఎల్ మిషన్లను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతోందని, సాంకేతికంగా అభివృద్ధి చేసిన మిషన్లను ఏర్పాటు చేయకుండా పనిగంటలు పెంచడం ద్వారా కార్మికులను ప్రమాదంలో నెట్టుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గనుల్లో ప్రథమ చికిత్సా పరికరాలు, స్ట్రెచర్లు, స్పెషలిస్ట్ వైద్యులను నియమించాల్సిన అవసరం ఉన్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మృతుడి కుటుంబానికి ఎక్స్ గ్రేషియాతోపాటు, కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సలెంద్ర సత్యనారాయణ, కంది శ్రీనివాస్, సాంబారు వెంకటస్వామి, అల్లి రాజేందర్, జే. రవీందర్, ఓ. రాజశేఖర్, నరేందర్, మిట్ట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**గనిని సందర్శించిన మంత్రి వివేక్..**

కార్మికుడు శ్రావణ్ కుమార్ మృతి విషయంలో మంత్రి వివేక్ కెకె–5 గనిని శనివారం సందర్శించారు. ప్రమాద ఘటనను స్థానిక అధికారుల నుంచి, కార్మికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రక్షణ చర్యల అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఏరియా జీఎం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బొగ్గు ఉత్పత్తితో పాటు కార్మికుల ప్రాణాలు కూడా సురక్షితంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సింగరేణి ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి రక్షణ చర్యలను కఠినంగా అమలు చేస్తామన్నారు. అనంతరం రామకృష్ణాపూర్ ఆసుపత్రిలో మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబానికి అన్ని రకాల బెనిఫిట్స్‌ను వెంటనే అందజేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట వాసిరెడ్డి సీతారామయ్య, కాంపెల్లి సమ్మయ్య, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## ఆసుపత్రుల్లో వైద్య సేవల పర్యవేక్షణ



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో అంటు వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించి అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, వైద్య సిబ్బంది విధుల్లో సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించాలన్నారు.అనంతరం కలెక్టర్ కస్తూరి బా గాంధీ బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాలలను సందర్శించి వంటశాల, మూత్రశాలలు, తరగతిగదులు, హాజరు పట్టికలు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, త్రాగునీరు అందించడంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయంలో భూభారతి రెవెన్యూ సదస్సులో అందిన భూ సమస్యల దరఖాస్తులను పరిశీలించారు. భూమి సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, ధృవపత్రాల మంజూరులో నిర్దిష్ట గడువులను పాటించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సతీష్ కుమార్, సంబంధిత శాఖల పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ నిధుల విడుదలపై హర్షం



**శెనార్తి మీడియా, కేశవపట్నం**

రైతులకు పీఎం కిసాన్ నిధుల 20వ విడత విడుదల కావడంపై బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం కేశవపట్నం రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మండల బీజేపీ అధ్యక్షుడు ఎనుగుల అనిల్ మాట్లాడుతూ, జవాన్ దేశాన్ని కాపాడితే, కిసాన్ దేశాన్ని పోషిస్తాడని, ఈ ఇద్దరికీ ప్రాధాన్యత ఇవ్వడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.వారణాసి నుంచి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని రైతులతో కలిసి వీక్షించిన అనంతరం, వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం కేంద్రం కృషి చేస్తోందని అనిల్ అన్నారు. అనంతరం బీజేపీ నాయకులు రైతులకు స్వీట్లు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఏఓ వెంకటేష్, బీజేపీ జిల్లా ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, నాయకులు దాసారపు నరేందర్, కొయ్యడ అశోక్, రాసమల్ల శ్రీనివాస్, కనకం సాగర్, మందాడి జగ్గారెడ్డి, బిజిలి సారయ్య, పడాల వెంకటలక్ష్మి , గూళ్ల రాజు, బొజ్జ సాయి ప్రకాష్, రమణ రెడ్డి పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఓదార్పు

- యాజమాన్యాన్ని తప్పుబట్టిన బాల్క సుమన్



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా మందమర్రి కెకె–5 గనిలో జరిగిన ప్రమాదం అధికారుల నిర్లక్ష్యమే కారణమని మాజీ జిల్లా అధ్యక్షులు, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. శనివారం రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి మార్చురీ వద్ద గనిప్రమాదంలో మృతి చెందిన యువకార్మికుడు రాసపల్లి శ్రావణ్ కుమార్ మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల భద్రతను యాజమాన్యం నిర్లక్ష్యంగా గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం లాభాలకే ప్రాధాన్యత ఇస్తోందని, కార్మికుల ప్రాణాలకు విలువ ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఇరవై నెలల కాంగ్రెస్ పాలనలో అనేక ప్రమాదాలు జరిగినా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల భద్రతకు పెద్ద పీట వేసి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని హెచ్చరించారు.

### ఎన్నికల కోడ్ తో

## ఎత్తిపోతల ప్రారంభం వాయిదా

- కాంగ్రెస్ పనులుగా ఫోజులు కొడతున్నారని బీఆర్ఎస్ నేత కోరుకంటి చందర్ ఆగ్రహం



**శెనార్తి మీడియా, రామగుండం**

ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో రామగుండం ఎత్తిపోతల పథకాన్ని అధికారికంగా ప్రారంభించలేకపోయామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. తాము చేపట్టిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ నేతలు తమ విజయంగా ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు.గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎల్లంపల్లి వద్ద గోదావరి నదిపై శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించినా, రామగుండం ప్రాంత రైతులకు చుక్క నీరు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. ఈ కారణంగా అక్కడి రైతులు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిపై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు.బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, 2017 డిసెంబరులో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.72 కోట్లు మంజూరు చేసి రామగుండం ఎత్తిపోతల పథకానికి నాంది పలికినట్లు తెలిపారు. 2018 ఫిబ్రవరి 27న ముర్మూర్ గ్రామంలో స్వయంగా సీఎం కేసీఆర్ భూమి పూజ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఏడాదిలోగా పథకాన్ని పూర్తి చేయాలని ఆదేశించినప్పటికీ, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల పనులు ఆలస్యం అయ్యాయని చెప్పారు.తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో పథకానికి సంబంధించిన పనులు దాదాపుగా పూర్తయ్యాయని, కుక్కలగూడూర్ రైతులను అడిగితే నిజం వెలుగులోకి వస్తుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ వారికి రైతుల పట్ల కనీస ఆవగింజంత బాధ్యత లేకపోయిందని, తాము వేసిన పైపుల నుంచే ఇప్పుడు నీటి ప్రసారం జరుగుతోందని పేర్కొన్నారు. "తాము చేసిన పనులను కాంగ్రెస్ నేతలు తమదైన శ్రేయస్సుగా చాటుకోవడం సిగ్గుచేటు. ప్రజలంతా గమనిస్తున్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే ఓటు ద్వారా గుణపాఠం చెబుతారు," అని హెచ్చరించారు కోరుకంటి చందర్.

## కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వంపై వర్క్ షాప్..

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**

తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 29 నుంచి 31 వరకు కథ, స్క్రీన్ ప్లే,దర్శకత్వం అనే అంశాలపై వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ వాయిస్ స్టూడియో,వర్క్ షాప్ నిర్వాహ కుడు రమేశ్ కిషన్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. టాలీవుడ్ సినిమా రచయితలు, దర్శకులు అతిథులుగా హాజరవుతారని, ఆసక్తి కలిగిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇందులో టాలీవుడ్ సినిమా రచయితలు, దర్శకులు విశిష్ట అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 7396817623, 9247140023 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## యోగా ద్వారా అనేక లాభాలు..

- ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బీజీఆర్..



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**

యోగాసనాలతో ఆరోగ్యపరమైన లాభాలు కలుగుతాయని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు.ఆదిలాబాద్ జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7,8వ తేదీల్లో రత్న గార్డెన్లో సీనియర్ విభాగాల్లో యోగాసన ఎంపికలు నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో శనివారం పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, అన్వేష్ బాబు,సంతోష్ తదితరులున్నారు.

## జనహిత పాదయాత్రను విజయవంతం చేయండి..

- బోరంచు శ్రీకాంత్ రెడ్డి

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**



జనహిత పాదయాత్రను విజయవంతం చేయాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాజకీయ వ్యవహారాల ఇన్చార్జ్, ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్న జనహిత పాదయాత్ర ఖానాపూర్ మండలం బాదన్ కుర్తి నుండి ప్రారంభం అవుతుందని,జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్,యువజన కాంగ్రెస్, కిసాన్ కాంగ్రెస్, ఐఎన్టీయూసి, ఎన్ఎస్యూఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయగలరని కోరారు.

## వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి..

- రెయిన్ బో సంస్థ అధ్యక్షుడు కొమ్ము రాము..



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**

ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో రెయిన్ బో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కొమ్ము రాము మాట్లాడుతూ..వర్షాకాలంలో చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలన్నారు.దోమలు వృద్ధి చెందటంతో మలేరియా,డెంగ్యూ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు కవిత,గోదావరి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి నిర్లక్ష్యమే గని ప్రమాదానికి కారణం

- బాధ్యులపై చర్యలు తప్పవు
- మంత్రి వివేక్ వెంకటస్వామి



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

సింగరేణి అధికారుల నిర్లక్ష్యం వల్లే కెకె-5 గనిలో జరిగిన ప్రమాదం చోటు చేసుకుందని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. శనివారం రాసపల్లి శ్రావణ్ కుమార్ మృతదేహానికి సింగరేణి ఏరియా ఆసుపత్రి మార్చురీలో నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... గనిలో సేఫ్టీ అధికారులు కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం, పాత యంత్రాలను వినియోగించడమే ప్రమాదాలకు దారితీస్తుందని విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.సింగరేణిలో భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా, ఉత్తమ ప్రమాణాలతో కూడిన ఆధునిక యంత్రాలను వినియోగించేలా తగు చర్యలు చేపడతామన్నారు.

# జాతీయస్థాయిలో నార్నూర్ కు గోల్డ్ మెడల్..

- గవర్నర్ చే అవార్డు అందుకున్న కలెక్టర్ రాజర్షి షా..

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**



నీతి ఆయోగ్ పథకం కింద కేంద్రం నుంచి 'ఆస్పిరేషనల్ బ్లాక్'గా ఎంపికైన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలానికి గోల్డ్ మెడల్ లభించింది. శనివారం హైదరాబాద్ లోని రాజ్ భవన్ లో సమ్మాన్ సమారోహ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా గోల్డ్ మెడల్ అవార్డును అందుకున్నారు.నీతి అయోగ్ ఎంపిక చేసిన 500 ఆస్పిరేషన్ బ్లాకులలో నార్నూర్ మొదటి స్థానంలో నిలిచి ఏకైక స్వర్ణ పథకాన్ని గెలిచింది.ఆరోగ్య, పోషణ,వ్యవసాయం,విద్య, మౌలిక సదుపాయాలు తదితర 6 సూచికలలో మెరుగైన పనితీరును ప్రదర్శించినందుకే ఈ పురస్కారం లభించింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ల పాల్గొన్నారు.

# కొత్త నాటకానికి తెరలేపిన కాంగ్రెస్..

- ఎమ్మెల్యే పాయల్ శంకర్




**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**

బీసీలందరూ తిరగబడుతున్నారని గమనించిన కాంగ్రెస్ పార్టీ,సీఎం రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్ల పేరుతో కొత్త నాటకానికి తెరలేపారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు..ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ ని కట్టబెట్టడానికి బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు.కాంగ్రెస్ పార్టీకి నిజంగా బీసీలపై చిత్తశుద్ధి ఉంటే 42 శాతం బీసీ రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఆనాడు ఎంబీసీ పేరుతో బీసీలను మోసగించిన బీఆర్ఎస్ ప్రభుత్వం, ఈనాడు కాంగ్రెస్ రిజర్వేషన్ల పేరుతో బీసీలను మరో మారు మోసగిస్తుందన్నారు.కామారెడ్డి డిక్లరేషన్ ను అమలు చేసేంతవరకు బిజెపి కాంగ్రెస్ ని వెంటాడుతూనే ఉంటుందన్నారు.

# నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు

- వెల్నెస్ సెంటర్ తనిఖీ చేసిన ఆరోగ్యశ్రీ జీఎం

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**



వెల్నెస్ కేంద్రాల ద్వారా నాణ్యమైన వైద్యంతో పాటు మందులను అందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆరోగ్యశ్రీ జీఎం డా.రాంబాబు నాయక్ తెలిపారు.శనివారం ఆదిలాబాద్ వెల్నెస్ సెంటర్ ను ఆయన తనిఖీ చేశారు. మందుల నిల్వలతో పాటు వైద్యుల పని తీరును అడిగి తెలుసుకున్నారు.సెంటర్ కు వచ్చిన రోగులతో మాట్లాడి ఇక్కడి సేవల గురించి ఆరా తీశారు.సెంటర్లో కొన్ని మందుల నిల్వలు లేనట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అదేవిధంగా రిమ్స్ డయాలసిస్ కేంద్రాన్ని, పట్టణంలోని నక్షత్ర ప్రైవేట్ ఆసుపత్రిని సందర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎ శ్రీనివాస్, ఈహెచ్ఎస్ చంద్ర శేఖర్, డీసీ డా.రాధిక, టీఎల్ వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్సియూ లో సీటు సాధించిన విద్యార్థిని..

- విద్యార్థినిని సన్మానించిన కళాశాల యాజమాన్యం..



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**

ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ కు చెందిన విద్యార్థిని కరుణ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ హిందీలో సీటు సాధించింది.కరుణ కళాశాలలో ఎంపీసీ ఇదే విద్యా సంవత్సరం పూర్తి చేసి,జాతీయ స్థాయిలో నిర్వహించే CUET-PG పరీక్ష రాసి 107 స్కోర్ సాధించింది. ఈ స్కోర్ తో హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయంలో చేరింది.ఈ సందర్భంగా కరుణను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంగీత సన్మానించారు.విద్యార్థులు కరుణను స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు పేరు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో హిందీ అధ్యాపకులు రాధ,నంద కుమార్,అధ్యాపకులు రడాపు సంతోష్ కుమార్,శ్రావణి, శ్రీధరాదేవి,జ్యోత్స్న పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన చరణ్..

- టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో సన్మానం..

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**



జాతీయ స్థాయి సబ్ జూనియర్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన చరణ్ తేజ ఎంపికయ్యాడు.శనివారం టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో సత్కరించారు. బెంగళూర్ లో జరుగుతున్న పోటీలకు వెళ్తున్న క్రీడాకారుడిని సత్కరించి ప్రోత్సాహకంగా నగదు అందించారు.పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్,నవీన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్, అరుణ్ కుమార్,సంజయ్, సంతోష్,రజనీకాంత్,అఖిల్ సిమ్మింగ్ కోచ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఇంద్రా పార్క్ వద్ద భారీ ధర్నా

- పాల్గొన్న పెద్దపెల్లి జిల్లా నేతలు

**శెనార్తి మీడియా, పెద్దపెల్లి**



తెలంగాణ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ ఇంద్రా పార్క్ వద్ద బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర నిరసనగా భారీ ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమం బీసీ కమ్యూనిటీ హక్కుల రక్షణ కోసం బీజేపీ చేపడుతున్న పోరాటానికి మరింత బలం చేకూర్చిందని పలువురు అభిప్రాయ పడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలును వెంటనే ప్రారంభించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీసీల హక్కుల కోసం నిరంతరంగా కృషి చేస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా నాయకత్వం ఈ ధర్నా ద్వారా బీసీల సంక్షేమం కోసం తమ కట్టుదిట్ట సంకల్పాన్ని తెలియజేసిందన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా బిజెపి నాయకులు సోమారపు లావణ్య పాల్గొనగా, ఆమెతో పాటు పెద్దపల్లి జిల్లా నాయకులు, కాసిపేట శివాజీ, రాజగోపాల్, రవీందర్, మహావాది రామన్న, శివ, సంపత్ రావు, రాజేశ్వరరావు, రమేష్, దాసరి శ్రీనివాస్, నవీన్, సంపత్, శ్రీనివాస్, రాకేష్, కమల్ పాల్గొన్నారు.

## ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి..

- మాజీ ఎంపీ సోయం బాపురావు..



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**

ఈనెల 9న ఆదివాసీ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని రాజ్ గోండ్ సేవా సమితి అధ్యక్షుడు, మాజీ ఎంపీ సోయం బాపురావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్,ఉట్నూర్, ఆసిఫాబాద్ లో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆసిఫాబాద్ లో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు.ఆదివాసీ సంస్కృతి,సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగాలన్నారు.అధిక సంఖ్యలు పాల్గొనాలని కోరారు.ఈ సమావేశంలో నాయకులు పంద్రం శంకర్,ఆనంద్ రావు, శ్యామ్ రావు,జంగు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో వసతులు కల్పించండి

**ఆర్డీఓ, కమిషనర్ కు ఎమ్మార్పీఎస్ వినతి**



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం 24వ వార్డు అంబేద్కర్ బస్తీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తగిన వసతులు కల్పించాలని ఎమ్మార్పీఎస్ నేతలు ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ కు శనివారం వినతిపత్రం అందజేశారు.పాఠశాలలో విద్యార్థులకు త్రాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు వంటి మౌలిక సదుపాయాల కొరత ఉండడంతో, తక్షణమే నిధులు మంజూరు చేసి వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు రామగిరి మహేష్, నేతలు మచ్చ రాజేష్, చంద్రశేఖర్, ధర్మేందర్, రత్నం, ఐలయ్య పాల్గొన్నారు.

## మానసిక వేదనతో యువతి ఆత్మహత్య

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం ఖర్జీ గ్రామానికి చెందిన యువతి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన శనివారం చోటుచేసుకుంది. అద్దరపల్లి నాగేష్ కుమార్తె అద్దరపల్లి మమత (19) మానసిక వేదనతో ఇంట్లో దూలానికి ఉరివేసుకొని మృతి చెందింది. నెన్నెల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మమత గత సంవత్సరం బెల్లంపల్లి గ్రామానికి చెందిన ఖాజా అనే వ్యక్తి నుంచి టిఎస్ 20 టీ 1162 నంబరుతో ఆటోను కొనుగోలు చేసింది. అప్పటి నుంచి ఆటోను నడుపుతూ కుటుంబాన్ని పోషించేది. నెల రోజుల క్రితం ఆటోను ఫైనాన్స్ వారు తీసుకువెళ్లడంతో మమత తీవ్ర మనోవేదనకు గురైంది. ఆటోను అమ్మిన వ్యక్తి డబ్బులు కట్టలేదని ఫైనాన్స్ వారు తీసుకువెళ్లారని మమత ఆవేదన వ్యక్తం చేసింది. ఉపాధిని కోల్పోయిన బాధతో ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు ముందు మమత సూసైడ్ నోట్ రాసిపెట్టి ఉరివేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తండ్రి నాగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెన్నెల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తాగునీటి సరఫరాకు వారం పాటు అంతరాయం

- సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తాం : కమిషనర్ రమేష్




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

ఆడ ప్రాజెక్టు నుంచి బెల్లంపల్లి మున్సిపాలిటీకి సరఫరా అవుతున్న తాగునీటికి వారం రోజుల పాటు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఆడ ప్రాజెక్టు వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద చెత్త పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడిందని, ఈ కారణంగా తాగునీటి సరఫరాపై ప్రభావం పడుతుందని కమిషనర్ వివరించారు. ప్రస్తుతం పరిస్థితిని నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నామని, ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.నీటి సరఫరా సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని, పరిస్థితి చక్కబడే వరకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు.